# కాలచక్రం

సజగ్నాథ్ [నవ్యభారతి]

అబ్బ! కాలచక్రం ఎంత వేగంగా తిరిగింది. నాకళ్లముందు ఆడుకుంటూన్న పిల్ల...ఎంత పెద్దదయింది! ఇప్పుడు నాకూ—ఆమెకీ ఎంత తారతమ్యం వుంది. ఆమె ఇల్లాలు... నేను బ్రహ్మచారిని...ఆమెకు సంసారసుఖాలు తెలుసు—నాకింకా...—చిన్నతనంలో ఎంత పెంకితనంచేసేది? ఇంకా ఆకారు పట్టుందేమో. మేం ఇద్దరం ఒక్క కంచంలోనే తినడం ఒక్కమంచంమీద పడుకోవడం జ్ఞాపకం ఉన్నాయా!! ప్రతివిషయానికి "బావా! నాకు చెప్పవ్" అని అడిగేది. ఆరోజున వాళ్ల నాన్నగారు పనసతొనలు తెస్తే తన వొంతులోనివి రెండు తెచ్చి "బావా! నా జట్టు ఎప్పుడూ వుంటావ్ కదూ" అన్న మాటలు మరిచిపోయింది కాబోసు. ఒకరోజు సాయంత్రం మాయింటికొచ్చి "అత్తా నాకీ గులాబీపువ్వు యివ్వవ్" అని మా అమ్మనడిగితే "ఏమే! ఇలా పెళ్లికూతురులా ముస్తాబయినావు" అంటే "పోనీ అత్తా! ఎప్పుడూ ఇవే మాటలు" "ఏం పెళ్లంటే అంత కోపమా? ఇవాళ కాకపోతే రేపైన అవక మానుతుందా" "పోఅత్తా! గులాబీపువ్వు ఇయ్యి" "ఇస్తాను కాని బావను పెళ్లాడుతావా" ఇంతలో నేను రావడం మెరుపులాగ ఆమె పారిపోవడం అంతా క్షణకాలంలో జరిగినాయి. ఆ ప్రక్కనున్నవాడు దాని మొగుడు కాబోసు. ఎంత అదృష్టవంతుడు? ఆ వాటం ఆ మీసాలు, ఆతలపాగాయింకాయింకా—వీడా దానికి మొగుడు. కాకి ముక్కుకి దొండపండు మల్లేవుంది. ఒక్కక్షణమైనా మాట్లాడకుండా ఉండలేకపోయేది. ఇప్పుడు ఒక్కమాటైనా—అబ్బ! స్త్రీలది ఎంత కఠినహృదయం. ఇప్పటికి మూడుసార్లే చూసింది. మరోసారి చూడకూడదూ?... నేత్రావధానమైనా రాదు మనోభావాలు తెల్సుకుందామంటే. ఆ రోజున వాళ్ల నాన్నగారు ఊరికెళ్లారు. వాళ్లమ్మ ఇంట్లోకి రాదు. "ఒరే! బాబూ, ఈ రాత్రి మా అమ్మాయికీ సాయంపడుకోవూ" అని బతిమాలితే వెళ్లాను. కొంత రాత్రయింది. "బావా...నాకు భయంవేస్తోంది. నా పక్కలోకొచ్చి పడుకోవూ" అంటే ఆమెప్రక్కలో పడుకున్నా. "అబ్బ! చెడ్డ భయంవేస్తోంది. ఆ గుడ్లగూబ చూడూ! ఎలా అరుస్తుందో దానికి నిద్దరైనా రాదు కాబోసు" అని నన్ను కాగలించుకొని పడుకుంది. ఇప్పుడో ఆమె దగ్గరికైనా వెళ్లడానికి హక్కులేదు. ఆమైనా నాతో మాట్లాడకుండా ఎలా ఉందో?...అవును...ఎలామాట్లాడుతుంది ప్రక్కను యముడులాంటి మొగుడుంటే. చిన్నప్పుడు ఒక్క కంచంలోతినేవారం. ఇప్పుడో అధమా ఒకపంక్తిలోనైనా...వీల్లేదు. అప్పుడు చిన్న లాగుచొక్కా తొడుక్కునేది. ఇప్పుడలా తిరిగితే...ఆ వాలుజడ ఎంత పొడుగ్గా ఎంత చక్కగా ఉంది. మొన్ననే చూసిన నల్లత్రాచుని మరిపిస్తున్నట్టుంది. లోపల జంపర్ని చీరతోసహా ఎలా తోసుకొచ్చాయో ఆ వక్షోజాలు. ఆ రాత్రి కాగలించుకొని పడుకుంది. ఇప్పుడలా చేయరాదూ? అమ్మ బాబో! ఆమె నిజంగా పతివ్రత. ఆ యీమాటుంటే నన్ను ఏ చెట్టుగానో, పుట్టగానో, పాషాణంగానే మార్చెయ్యదూ...అప్పటి సంగతులు జ్ఞాపకం తెచ్చుకొని నన్నెంత తిట్టుతుందో? అబ్బ! వెధవ ట్రైను ఎంతకీరాదు. వీళ్లెక్కడికెళ్తున్నారో అడిగితే బాగుణ్ణు? ఆవిడ తనూ మాట్లాడుతే ఆ వెధవ...కాదూ మా సోదరుడు... మా గొప్పవాడు ఆమెను ఏం హింసిస్తాడో? కొంపదీసి ఇప్పుడు మే మిద్దరం ఈ ప్లాటుఫారంమీద కుస్తీ పట్టాలి కాబోసు. పోనీ అలా కుస్తీపట్టినా నేను గెలిస్తే వాడిపెళ్లాన్ని నాకిచ్చేస్తాడా? ఛీ...ఛీ... పరస్త్రీని కోరడం ఎంత అధర్మం! ట్రైయిన్ కూడా వచ్చేసింది. ఆమె ఆమె భర్తా ట్రెయిన్ ఎక్కారూ. ఆ బండిలో వస్తానని వ్రాసిన మా అన్నయ్యరాలేదు. బండీ కదుల్తోంది. Good Bye అని చేయెత్తాను ఆమె వైపు చూస్తూ నేను చేయెత్తగానే బండీ కదిలింది. పక్క కంపార్టుమెంటులోనున్న యూరోపియన్ వాడికే సెల్యూట్ చేసేననికాబోసు రిసీవ్ చేసుకున్నాడు. కనుచూపుమేరవరకు బండినిచూసి ఇంటికి దారి తీసేను.